
గుంతలతో తప్పని తిప్పలు

- నెలలు గడుస్తున్నా మూసివేయని 'భగీరథ' పైప్‌లైన్ గుంతలు
- ప్రమాదాలకు నిలయంగా మారుతున్న వైనం
- వృథాగా పారుతున్న తాగునీరు

నారాయణపేట టౌన్: పట్టణంలోని పలు వార్డుల్లో మిషన్ భగీరథ పనుల నిమిత్తం తవ్వకాలు చేపట్టి కొత్త పైప్‌లైన్ వేశారు. కానీ వాటి కోసం తవ్విన గుంతలు, డ్రైయినేజీ నిర్మాణాలకు మరమ్మతు చేపట్టకుండా వదిలివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఇరుకైన రోడ్లల్లో భగీరథ పనుల కోసం జేసీబీ ద్వారా సీసీ రోడ్లు, డ్రైయినేజీలను తవ్వి పైపులైన్ వేయించారు. గుంతలను అలాగే వదిలేయడంతో నిత్యం పాదాచారులు, వాహచోదకులు నానా అవస్థలు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. భగీరథ పనులు పూర్తయినా కూడా ఎక్కడ


హాజీఖాన్‌పేటలో తవ్విన డ్రైయినేజీ ఇలా..


యాద్గీర్ రోడ్‌లో డ్రైయినేజీ లేక నిలిచిపోయిన మురుగు

పడితే అక్కడ సీసీ రోడ్లపై భగీరథ పైపులు పగిలి లీకేజీలు అవుతున్నా వాటికి మరమ్మతు చేయాలనే సోయి కూడా లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీంతో వర్షాలకు డ్రైయినేజీల మురుగు రోడ్లపై పారడంతో భగీరథ నీరు కలుషిత అవుతుందని పలువురు వాపోతున్నారు. అదే విధంగా ప్రధానంగా యాద్గీర్ రోడ్, హరిజన వాడ, ఎస్సీ కాలనీ, సివిల్‌లైన్ రోడ్‌లో డ్రైనేయిజీల్లోని మురుగు సకాలంలో తొలగించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతుందని, తాత్కాలిక డ్రైయినేజీల వల్ల వర్షం కురిసిన ప్రతిసారి రోడ్లపై చెత్తచెదరాం, ప్లాస్టిక్ వర్థ్యాలు రావడంతో వాటిని తొలగించడంలో మున్సిపల్ అధికారులు దృష్టిసారించడం లేదంటున్నారు. వానాకాలం సీజన్ ప్రారంభంలో పారిశుద్ధ్య పనులు గాలికి వదిలేయడంతో రోగాల బారిన పడుతున్నామని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు భగీరథ పైప్‌లైన్ల కోసం తవ్విన గుంతులు, లీకేజీలను సరి చేయడం కోసం ప్రత్యేక చర్యలు తీసుకొని ప్రజల సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కరించాలి..

నెలలు గడుస్తున్నా భగీరథ పైప్‌లైన్ కోసం తవ్విన డ్రెయినేజీలకు మరమ్మతు చేయకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రాత్రి వేళ ఆ దారిలో నడవాలన్నా భయం వేస్తుంది. వర్షాకాలంలో ఆ గుంతల్లో నీరు మళ్లడంతో ద్విచక్రవాహనదారులు వాటిలో పడి గాయాలపాలవుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే పనులను పూర్తి చేసి సమస్య పరిష్కరించాలి.

– నగేష్, నారాయణపేట

లీకేజీలు సరి చేశారు..

గతంలో లీకేజీల కారణంగా గుంతలు తవ్వారు. లీకేజీకి మరమ్మతు చేపట్టారు. గుంతలు, డ్రైయినేజీలు వంటివి మరమ్మతు చేపట్టి సమస్య లేకుండా చూస్తాం. అలాగే అన్ని కాలనీల్లో రోడ్లపై మురుగు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకొని ప్రజలందరికీ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

– సునీత, మున్సిపల్ కమిషనర్, నారాయణపేట.

క్లుప్తంగా

పాఠ్య పుస్తకాల పంపిణీ



కృష్ణా: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో శనివారం ఎంఈఓ వెంకటయ్య, సీఆర్‌పీ అమీన్‌రెడ్డి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఆంగ్లంలో పట్టుసాధించేందుకు జాలీ ఫోనిక్స్ పుస్తకాలు ఉపయోగపడుతాయన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మాగనూర్: ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కారించాలని మాగనూర్ మండల ఎంఈఓ కార్యాలయం ముందు శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఎంఈఓ కార్యాలయం సిబ్బంది స్వప్నకు వినతిపత్రం అందజేశారు. జిల్లా కోకన్వీనర్ పుంజనూర్ ఆంజనేయులు మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ. 18 వేల కనీస వేతనం అమలు చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన సంఘం మండల అధ్యక్షులు ప్రమీల, మండల కార్యదర్శి శంకరమ్మ, లక్ష్మీ దేవమ్మ, గంగమ్మ, గౌసియా, రాధ, సుగుణమ్మ, వెంకటమ్మ, గజలమ్మ, మారెమ్మ, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు

మక్తల్: మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో సీసీరోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఏఈ నాగశివ శనివారం పనులను పరిశీలించారు. మాజీ ఎంపీటీసీ కోళ్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల కమిటీ ఎన్నిక

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ గ్రామానికి చెందిన నాయీబ్రాహ్మణుల సంఘం నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ఆశప్ప, ఉపాధ్యక్షునిగా రవి, ప్రధాన కార్యదర్శిగా రమేష్, సహాయ కార్యదర్శిగా సత్యప్ప, కోశాధికారిగా హన్మంతు, సలహాదారుడిగా సుభాష్‌ను ఎన్నుకున్నారు. నాయీబ్రాహ్మణులను ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగడానికి ఐక్యంగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు.

రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



మద్దూరు: మండలంలోని రెనివట్ల గడ్డమీది గేరిలో చిన్నపాటి వర్షానికే కాలనీ రోడ్డుపై నీరు నిలిచి రాకపోకలు సాగించడానికి వీల్లేకుండా పోతోంది. గతంలో వర్షం పడినా నీరు వెళ్లిపోవడానికి ఉండేదని, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటు చేయడంతో నీరంతా రోడ్డుపైనే నిలుస్తోందని మాజీ సర్పంచ్ వెంకటేష్ అన్నారు. పంచాయతీ అధికారులకు విన్నవించినా లాభం లేకుండా పోయిందని పేర్కొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

అమరచింత: పట్టణంలోని బీసీకాలనీలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి ధూపదీప నైవేద్య పథకంలో చోటు కల్పించాలని కోరుతూ కాలనీవాసులు బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నరసింహులుగౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి శనివారం మక్తల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ బాగోగులతో పాటు నిర్వహణ కోసం దేవాదాయ, ధర్మాదాయ శాఖకు సిఫారసు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలనీ వాసులకు హామీ ఇచ్చారని తెలిపారు. గతంలో ఆలయ అభివృద్ధికి రూ.ఐదు లక్షలు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పారుపల్లి చింతన్న, పోబ్బతి వెంకటస్వామి పాల్గొన్నారు.

ఇంటి పన్ను తగ్గించాలని ధర్నా



ఆత్మకూర్: ప్రభుత్వం 40 ఏళ్ల క్రితం ఇచ్చిన 75 గజాల స్థలంలో నిర్మించుకున్న ఇళ్లకు ఇంటి పన్నులు తగ్గించాలంటూ స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట శనివారం సంజయ్‌నగర్ కాలనీవాసులు ధర్నా నిర్వహించారు. రూ.800 ఉన్న పన్నును ఏకంగా రూ.3,500 పెంచడం సమంజసం కాదన్నారు. భువన్ సర్వే పేరిట 40 ఏళ్ల తర్వాత తమకు అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కమిషనర్ నాగరాజుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సద్దల వెంకట్రాములు, బాలకృష్ణ, రఘు, శంకర్, శివ, కొండన్న, రాజశేఖర్, షాకీర్, భారతీయుడు, శ్రీను, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

గ్రూప్-4 పరీక్షలో అవస్థలు


ప్రభుత్వ గ్రౌండ్ స్కూల్ కేంద్రంలో డ్యూయల్ డెస్క్ బేంచీలు లేక కాళ్లపై ప్యాడ్ పెట్టుకుని పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన గ్రూప్–4 పరీక్షలో అభ్యర్థులు అసౌకర్యాలతో ఇబ్బందిపడ్డారు. ప్రభుత్వ గ్రౌండ్ ఉన్నత పాఠశాలలో అన్ని గదుల్లో డ్యుయల్ డెస్క్ బేంచీలు లేక కాళ్లపైనే ప్యాడ్‌లు పెట్టుకుని ఇబ్బందిపడుతూ పరీక్ష రాశారు. డ్యుయల్ డెస్క్ బేంచీలు ఉంటాయని ప్యాడ్ లేకుండా వచ్చిన వారిలో కొందరు అప్పటికప్పుడు బయట ప్యాడ్‌లు కొనుగోలు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో ఒకే గదిలో (9ఎ, బి) పేరుతో 48మందిని కూర్చొబెట్టారు. అదే రూమ్‌లో ఫర్నిచర్ ఉండటంతో అభ్యర్థులు దగ్గర దగ్గరగా కూర్చొవడం కనిపించింది. అధికారులు పూర్తిస్థాయి పరిశీలన లేకుండా పరీక్ష కేంద్రాలను ఎంపిక చేయడంపై పలువురు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.


ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఒకే గదిలో పరీక్ష రాస్తున్న 48మంది అభ్యర్థులు

కారు బోల్తా తప్పిన ప్రమాదం

మాగనూర్: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎన్‌హెచ్167 పై ఉన్న మలుపు వద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కన గుంతలో పడిన ఘటన శనివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. మహబూబ్‌నగర్‌కు చెందిన కస్తూరి నిఖిల్ సొంత పనుల నిమిత్తం కర్ణాటకలోని దేవసూగురు ప్రాంతానికి వెళ్లి తిరుగుప్రయాణంలో ప్రమాదానికి గురైనట్లు స్థానికులు వివరించారు. పోలీస్‌స్టేషన్ సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న డస్ట్(క్రేషర్ ఇసుక) వాహనం నుంచి వచ్చిన దుమ్ము వల్ల రోడ్డు కనిపించకపోవడంతో ప్రమాదం చోటు చేసుకుందని అన్నారు. కాగా కారులో ఉన్న నిఖిల్ స్వల్పగాయాలతో బయటపడ్డాడని స్థానిక పోలీసులు సమీపంలోని ఆస్పత్రికి తరలించారని వివరించారు.

చిరుత దాడిలో గాయపడ్డ దూడ మృతి

మరికల్: రెండు రోజుల క్రితం చిరుత దాడిలో గాయపడ్డ దూడ శనివారం మృతి చెందింది. మండలంలోని పూసల్‌పహాడ్ పరిధిలోని సంజీవకొండకు చెందిన ఆంజనేయులు తన పశువులను గత నెల 29న పొలం వద్ద కట్టేసి ఇంటికి వచ్చాడు. అర్ధరాత్రి సమయంలో చిరుత లేగదూడపై దాడి చేస్తుండగా కుక్కల అరుపులు విని పారిపోయింది. చిరుత దాడిలో దూడ తీవ్రంగా గాయపడింది. చికిత్స అందించినా ఫలితం లేకపోవడంతో శనివారం మృతి చెందినట్లు బాధిత రైతు తెలిపారు. ఈ ప్రాంతంలో సంచరిస్తున్న చిరుతను అటవీ శాఖ అధికారులు పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.

వరుణదేవా.. కరుణించు

ఆత్మకూర్: మొలకెత్తిన విత్తనాలు ఎండిపోతున్నాయని.. పశువులు, పక్షులు తాగునీటి కోసం అల్లాడిపోతున్నాయి కరుణించి వర్షాలు కురిపించు వరుణ దేవుడా అంటూ రైతులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన రైతులు, ఎడ్ల బండ్లల్లో, ట్రాక్టర్లలో కృష్ణానదికి వెళ్లి పవిత్ర జలాలను బిందెల్లో ఊరేగింపుగా తీసుకొచ్చారు.

3న కలెక్టరేట్ ఎదుట ధర్నా


అమరచింతలో మాట్లాడుతున్న అజయ్

అమరచింత: గుడిసెలు నిర్మించుకున్న పేదలకు ఇంటి స్థలాలతో పాటు గృహలక్ష్మి పథకాన్ని వర్తింపచేయాలని కోరుతూ ఈనెల 3న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ తెలిపారు. శనివారం పట్టణంలోని దుంపాయికుంటలో గుడిసెలు నిర్మించుకున్న నిరుపేదలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రం వ్యాప్తంగా 68 సెంటర్లలో పేదలు వేసుకున్న గుడిసెల లబ్ధిదారులందరికీ పట్టాలు పంపిణీ చేసి గృహలక్ష్మి పథకం అమలు చేయాలని కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అన్ని జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్‌ల వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాసన్న, వసంత, కవిత, చిట్టెమ్మ, భాగ్యమ్మ, శాంతమ్మ పాల్గొన్నారు.

అందుబాటులో వరి విత్తనాలు

దామరగిద్ద: వానాకాలంలో సాగు చేసేందుకు రైతులకు అవసరమైన వరి విత్తనాలు తెలంగాణ స్టేట్ సీడ్ కార్పొరేషన్ ఉమ్మడి మహబూబ్‌నగర్ గోదాంలో అందుబాటులో ఉన్నాయని టీఎస్‌సీడ్స్ సంస్థ ఉమ్మడి జిల్లా రీజినల్ మేనేజర్ రాజీవ్ తెలిపారు. వరి లావు రకాల్లో కేఎస్‌ఎం-118, ఎంటీయూ 1010, జేజీఎల్ 24423 విత్తనాలు, సన్న రకాల్లో కేఎన్ఎం 1836, బీపీటీ 5204 విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇప్పటికే అన్ని మండలాల్లో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్ కేంద్రాల్లో వరి విత్తనాలు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. కావాల్సిన రైతులు ఆయా మండల కేంద్రాల్లో పంప్రదించాలని కోరారు.


విత్తన ఉత్పత్తికి రైతులకు ఆహ్వానం

తెలంగాణ స్టేట్ సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, వనపర్తి సంస్థ ద్వారా వానాకాలం సాగులో విత్తన ఉత్పత్తి చేసేందుకు ఆసక్తి గల రైతులకు ఫౌండేషన్ సీడ్‌ను అందజేస్తున్నట్లు టీఎస్ఎస్‌డీసీ సంస్థ ఆర్ఎం రాజీవ్ తెలిపారు. వరి ఆర్ఎన్ఆర్ 15048, జేజీఎల్ 27356, కంది పీఆర్‌జీ 176, ఎల్ఆర్‌జీ 52 రకాలను విత్తన ఉత్పత్తికి అందజేస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఆసక్తి గల రైతులు తమ ఫోన్ నెంబర్ 79391 94719, 94927 27142ల ద్వారా సంప్రదించాలని కోరారు.

అధికారమే లక్ష్యంగా పనిచేయాలి

కోస్గి: రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా పని చేయాలని బీజేపీ కేంద్ర పరిశీలకులు విక్రంసింగ్, దినేష్ ఆచార్య సూచించారు. మండలానికి స్వల్పకాలిక్ విస్తారక్‌గా వచ్చిన వీరు స్థానిక నాయకులతో కలిసి శనివారం పలు బూత్‌లల్లో పర్యటించారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు సీబీ వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు శ్రీనివాస్, నరేష్, రమేష్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

ఊట్కూర్: పార్టీ పటిష్టతకు కృషిచేద్దామని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్ అన్నారు. శనివారం ఊట్కూర్‌లోని శ్రీశ్రీ వీరభద్రేశ్వర దేవాలయంలో శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌ల సమావేశం నిర్వహించారు. ఆత్మకూర్ బహిరంగ సభకు అధిక సంఖ్యలో తరలివచ్చినందుకు కార్యకర్తలను అభినందించారు. విస్తారక్ మహేందర్, మండల అధ్యక్షుడు రమేష్, రాష్ట్ర ఎస్సీ మోర్చ కన్వీనర్ విజయకుమార్, నాయకులు కృష్ణయ్య గౌడ్, కొండన్ గోపాల్, వెంకటయ్య, లక్ష్మన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పార్టీ కేంద్ర పరిశీలకులు

మక్తల్: సంగంబండలో ఎంపీటీసీ బాల్‌రెడ్డి నివాసంలో శనివారం బీజేపీ బూత్‌కమిటీల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా శివమొగ్గ జిల్లా అధ్యక్షుడు హరికృష్ణ పాల్గొన్నారు. అసెంబ్లీ కన్వీనర్ కర్నిస్వామి, కౌన్సిలర్ ప్రసన్నరెడ్డి, మండల బీజేపీ చిట్యాల లక్ష్మణ్, మోహన్‌గౌడ్, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సేవలు వెలకట్టలేం


మక్తల్‌లో వైద్యులకు సన్మానం


మాగనూర్‌లో..

మక్తల్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్ల దినోత్సవం సందర్భంగా వైద్యులు పార్వతి, శ్రీకాంత్ తదితరులను మండలం ఆర్ఎంపీల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. సిద్రామేశ్వర్, ఆశప్ప, చక్రధర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూర్: మండలంలోని చిన్నపొర్లలో ఆర్ఎంపీ మక్బూల్ పాషాను ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు జగన్నాథ్ రావు, రాయల్ హన్న, నరసింహా, భాస్కర్, లక్ష్మన్ పాల్గొన్నారు.

మాగనూర్: మండల కేంద్రంలో వైద్యాధికారి రంజిత్‌ను శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. బీసీరాయ్‌కు నివాళులర్పించారు. ఆర్ఎంపీల సంఘం ఉమ్మడి మండల అధ్యక్షుడు కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి తాయప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు ఖాజహూస్సేన్, రాంచందర్, నర్సిములు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నర్వ: వైద్యుల సేవలు వెలకట్టలేనివని ప్రైవేటు నర్సింగ్ హోమ్‌ల సంఘం గౌరవ అధ్యక్షులు గౌస్‌మియ్యా అన్నారు. అంతర్జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నర్వ పీహెచ్‌సీలో కార్యక్రమం నిర్వహించారు. ప్రైవేటు, ప్రభుత్వ వైద్యులను శాలువాలతో సన్మానించి, మొమెంటోలు అందించారు.

పాఠశాలల తనిఖీ

కోస్గి: మండల పరిధిలోని చంద్రవంచ, లోదిపూర్, కొత్తపల్లి పాఠశాలలను శనివారం ఏఎంఓ విద్యాసాగర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యర్ధన సామర్థ్యాల్లో వెనుకబడిన విద్యార్థుల కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు 45రోజులపాటు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. కొత్తపల్లి పాఠశాలలో ఉపాధ్యాయుడు రవీందర్ ఉదయం, మధ్యాహ్న సమయాలకు సంబంధించి రెండు పూటల సంతకాలు చేయడాన్ని గమనించారు. అతను పాఠశాలలో లేకపోవడంతో మెమో ఇవ్వాలని క్లస్టర్ జీహెచ్ఎం రాములుకు సూచించినట్లు ఏఎంఓ విద్యాసాగర్ తెలిపారు. మిగిలిన పాఠశాలల్లో విద్యార్థుల్లో సామార్థ్యాల కోసం చేపట్టిన కార్యక్రమాన్ని పరిశీలించారు.


లోదిపూర్‌లో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఏఎంఓ

విద్యుత్ సిబ్బందికి భద్రతా పరికరాలు


పరికరాలు పంపిణీ చేస్తున్న ఏఈ పర్వతాలు

కోస్గి: విద్యుత్ భద్రతా వారోత్సవాలను మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక సబ్ స్టేషన్‌లో విద్యుత్ సిబ్బందికి ఏఈ పర్వతాలు భద్రతా పరికరాలు పంపిణీ చేశారు. విధి నిర్వహణలో బాధ్యతగా ఉండాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లైన్ ఇన్‌స్పెక్టర్ మహమూద్, లైన్‌మెన్‌లు అరుణ్ కుమార్, వెంకట్‌రెడ్డి, అశోక్, దస్తయ్య, తిరుపతయ్య, చెన్నయ్య, అచ్చుతా రెడ్డి, కూర శ్రీను, ఆపరేటర్ రాజు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

ఊట్కూర్: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ఎనలేని కృషిచేస్తుందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం అవుసలోనిపల్లి–కొల్లంపల్లి రోడ్డుపై కల్వర్టు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షకాలంలో చౌటవాగు ప్రవహించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తుల వినతి మేరకు కల్వర్టు నిర్మాణానికి రూ. 36 లక్షలు మంజూరు చేసినట్లు వివరించారు. మండలంలో బీటీ రోడ్లు, కల్వర్టులు, గ్రామాల్లో సీసీ రోడ్లు వేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి, జెడ్పీటీసీ అశోక్ కుమార్ గౌడ్, సర్పంచ్ హన్మంతు, మాజీ సర్పంచ్ శివరాములు, నాయకులు లక్ష్మారెడ్డి, సాయులు గౌడ్, తిమ్మయ్య, లక్ష్మన్ పాల్గొన్నారు.


అవుసలోనిపల్లి శివారులో కల్వర్టు నిర్మాణానికి భూమిచేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి

కొనసాగుతున్న రిలే దీక్షలు


మాట్లాడుతున్న బలరాం

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ గ్రామంలో 53వ రోజు రిలే నిరసన దీక్షలు కొనసాగాయి. శనివారం బీజేపీ నాయకులు కెంచె శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు దీక్షలో కూర్చున్నారు. సాధన సమితి సభ్యులు దండలు వేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా నాయకులు బలరాం మాట్లాడుతూ.. పరిపాలనా సౌలభ్యం కోసం జిల్లాలు, మండలాలు చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించిన వెంటనే కోటకొండ గ్రామస్తులు అన్ని అర్హతలు ఉన్న తమ గ్రామాన్ని మండలం చేయాలని ప్రతిపాదనలు పంపామని, అయినా ప్రభుత్వం తిరస్కరించిందని అన్నారు. ఇటీవల కొన్ని గ్రామాలను మండలాలుగా ప్రకటించినా కోటకొండ గురించి పట్టించుకోవడం లేదని అన్నారు. విద్యారంగంలో అభివృద్ధి చెందాలంటే వెంటనే కోటకొండ వంటి వెనకబడిన ప్రాంతాన్ని మండలంగా మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, రాము, దస్తప్ప, యాదగిరి, రామకృష్ణ, సత్యప్ప, రాజు, కాశీనాథ్, రాములు, చెన్నప్ప, సలీం, బాలప్ప పాల్గొన్నారు.

'జీపీ' కార్మికులను పర్మినెంట్ చేయాలి

ఆత్మకూర్: గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పని చేస్తున్న పంచాయతీ కార్మికులను ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి రాజు డిమాండ్ చేశారు. శనివారం ఆత్మకూర్‌లోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. కార్మికులకు జీఓ నం.60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయడంతో పాటు ప్రమాదాల్లో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు రూ.25లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. డిమాండ్లను నేరవేర్చని పక్షంలో జులై 6వ తేదీ నుంచి రాష్ట్వ్యాప్తంగా నిరవధికంగా సమ్మెను చేపడుతామన్నారు. అనంతరం పలుడిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓకు అందజేశారు. కార్యక్రమంలో నాగన్న, రమేష్, బాలకృష్ణ, రాజు, తేజ, దేవన్న, శ్రీను, చెన్నప్ప, కార్మికులు ఉన్నారు.

అమరచింత: గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు జీఓ నం.60 ప్రకారం వేతనాలను పెంచాలని డిమాండ్ చేస్తు ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్‌కు ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి రాజు, సురేష్, నాగన్న, మొగిలి, శ్రీను, బాలస్వామి, రామచంద్రి, కురుమన్న, కతలన్న తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం


కాంగ్రెస్ జెండా కట్టకు రంగులు అద్దుతున్న నాగరాజుగౌడ్

అమరచింత: నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం సంతరించుకుంటుందని, గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ జెండా పండగలకు సర్వం సిద్ధం చేస్తున్నామని టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్ తెలిపారు. మండలంలోని కొంకన్‌వానిపల్లి, పాంరెడ్డిపల్లిలో శనివారం కాంగ్రెస్ పార్టీ జెండా కట్టల మరమ్మతుతో పాటు రంగులు వేయించారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మతిలేని మాటలు మాట్లాడుతున్నారని, బీఆర్ఎస్, బీజేపీలు ఒక్కటే అన్న విషయం ప్రజలకు ఇప్పటికే అర్థం అయ్యిందనే విషయాన్ని గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గ అబివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ గతంతో చేసిన పనులే నేటికి పదిలంగా దర్శన మిస్తున్నాయని తెలిపారు. నాడు ఇందిరమ్మ ఇళ్ల పేరిట ఇచ్చిన ఇళ్లు తప్ప ఇప్పటి వరకు నియోజకవర్గంలో ఇళ్లు, ఇంటి స్థలాలు ఇచ్చిన దాఖలాలు లేవని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్, నాయకులు మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, పోసిరిగారి విష్ణు, మన్యపురెడ్డి, బీసీరెడ్డి, రహ్మతుల్లా పాల్గొన్నారు.